పత్తి రైతుల ఆందోళన


కాయ ఎదుగుదల తగ్గిన పత్తి చేను

- వాతావరణ మార్పులతో సోకిన తెగుళ్లు
- మద్దతు ధర పెరిగినా.. దిగుబడిపై దిగాలు

చెన్నూర్: తెల్లబంగారంగా పేరున్న పత్తికి ప్రభుత్వం మద్దతు ధర పెంచింది. ఆరుగాలం శ్రమించి పంటసాగు చేసిన పత్తి రైతులు దిగుబడి పై గంపె డాశలు పెట్టుకున్నారు. గతేడాది వర్షాల కారణంగా పత్తి దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. ఈ ఏడాదైనా పత్తి దిగుబడి బాగుంటుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పత్తికి తెగుళ్లు సోకింది. మరో నెల రోజుల్లో చేతికొచ్చే పత్తి పంట, తెగుళ్ల బారిన పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దోమ, లద్దె పురుగు..

వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పత్తికి గతంలో ఎన్నడు లేని విధంగా దోమ, లద్దె పురుగు బెడద ఎక్కువైంది. కాయ ఏపుగా పెరిగే సమయంలో దోమ, లద్దెపురుగు సోకడంతో కొత్తగా వచ్చే పూత రాలిపోవడంతో పాటు కాయ పెరుగుదల నిలిచింది. పత్తి కాయ ఆశించిన మేరకు పెరగకపోవడంతో దిగుబడి తగ్గుతుందా అని రైతులు దిగాలు చెందుతున్నారు.

పెరిగిన మద్దతు ధర...

గతేడాది ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7020ఉండగా, ప్రైవేట్‌లో ధర రూ.9 నుంచి 10వేల వరకు పెరిగింది. ఈ ఏడాది క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.7520కి పెంచగా, ప్రైవేట్‌లో రూ.పది వేలకంటే ఎక్కువగా పెరిగే అవకాశాలు ఉంటాయని రైతులు అంటున్నారు.

పెరిగిన సాగు..

జిల్లాలో ఈ ఏడాది 1,51,386 ఎకరాల్లో పత్తి సాగు అయ్యింది. ముందస్తు వర్షాలు పత్తికి అనుకూలంగా కురువడంతో పత్తి సాగు పెరిగింది. పత్తికి ఎలాంటి తెగుళ్లు సోకకుంటే ఎకరానికి 18నుంచి 20క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. పూత, కాయ దశలో లద్దెపురుగు, దోమలు పెరగడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్‌లైంది.

దిగుబడి తగ్గుతుంది..



పత్తి పూత, కాయ దశలో దోమ, లద్దె పురుగు సోకితే కాయ పెరుగుదల ఆగిపోతుంది. లద్దె పురుగుతో పత్తి కాయ నాశనం కావడంతో ఆశించిన దిగుబడి రాదు. ఈ ఏడాది ఎకరానికి 5క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితులు కన్పించడం లేదు. ఈ ఏడాది పత్తి ధర పెరుగుతుందని పది ఎకరా లు సాగు చేశా. తెగుళ్లతో పెట్టుబడి చేతికి వచ్చుడు కష్టంగా మారింది.

– మానిశెట్టి శ్రీనివాస్, రైతు, చెన్నూర్

అప్రమత్తతతోనే అధిక దిగుబడి

- తెగుళ్లు, చీడపీడలు గుర్తించి మందుల పిచికారీతోనే నివారణ సాధ్యం
- బెల్లంపల్లి కృషివిజ్ఞాన కేంద్రం అధికారుల సూచన

బెల్లంపల్లిరూరల్: ఆరుగాలం శ్రమించి పంటను సాగు చేసే రైతన్న పంటలకు సోకుతున్న చీడపీడలు, తెగుళ్లతో నష్టాలు చవిచూస్తున్నాడు. ఈ ఏట మారిన వాతావరణ పరిస్థితులు, పంటల సాగుపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. పంటల సాగులో మూస పద్ధతిలోనే ఎరువులు, పురుగు మందుల వాడకంతో అనుకున్న ఫలితాలు రాక దిగుబడులు తగ్గుతున్నాయి. ముఖ్యంగా పత్తి పంటల సాగులో ఈ ప్రతికూల పరిస్థితులు అధికంగా ఉన్నాయి. మారిన పరిస్థితుల దృష్ట్యా అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవడం ద్వారానే అధిక దిగుబడులు పొంది రైతులు లాభాల బాటలో పయనించవచ్చని వ్యవసాయ నిపుణులు పేర్కొంటున్నారు. పత్తి పంటలను ఆశించే చీడపీడలు, తెగుళ్ల తీరుతెన్నులు శాస్త్రవేత్తల మాటల్లోనే...

పత్తి పంటలో రసం పీల్చే పురుగులు...

మారిన వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పత్తి పంటను రసం పీల్చే పురుగులు ఆశించే ప్రభావం ఎక్కువగా ఉంది. ముఖ్యంగా పచ్చదోమ, పేనుబంక, పిండి నల్లి పంటను ఆశించి తీవ్ర దిగుబడి నష్టాన్ని కలిగిస్తాయి. పంటను రసం పీల్చే పురుగులు ఆశించినట్లు గుర్తించిన వెంటనే 2మిల్లీ లీటర్ ఫిప్రోనిల్ లేదా 0.3మిల్లీ లీటర్ల ఇమిడాక్లోప్రిడ్ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అధిక తేమతో కాయ కుళ్లు...

గాలిలో అధిక తేమ కారణంగా పత్తి పంటలో కాయ కుళ్లు తెగులు సోకే ప్రమాదం ఉంది. ఈ తెగులు సోకిన వెంటనే 1గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ లేదా ప్లాంటామైసిన్ మందుకు 30గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో 10లీటర్ల నీటితో కలిపి 15రోజుల వ్యవధిలో మూడు నుంచి నాలుగు సార్లు పంటపై పిచికారీ చేయాలి. పంటను ఆశించిన తెగుళ్లు, చీడపీడలు పురుగులను గుర్తించి మందులు పిచికారీ చేయడం ద్వారా పంట నష్టాన్ని నివారించవచ్చు. రైతులు అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చు.


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు (ఫైల్)

సస్యరక్షణ చర్యలు పాటించాలి



రైతులు పంట సాగులో సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు పాటించాలి. చీడపీడలు, వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి. ముందస్తు నివారణ చర్యలు పాటించాలి. పంటల సాగులో అధిక మోతాదులో రసాయనిక ఎరువులు, పురుగుల మందులు పిచికారీ చేస్తే పంట నష్టం వాటిల్లే ప్రమాదాలు అధికంగా ఉంటాయి. రైతులకు కృషి విజ్ఞాన కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. సద్వినియోగించుకోవాలి. శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి.

– శివకృష్ణ, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, కృషివిజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి

క్లుప్తంగా

అనాథాశ్రమానికి తరలింపు


అనాథ మహిళను ఆశ్రమానికి తరలిస్తున్న సీఐ

చెన్నూర్: పట్టణంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న మహిళలను స్థానిక సీఐ రవీందర్ గుర్తించారు. మహిళలకు ఆశ్రయం కల్పించాలనే ఉద్దేశంతో మంచిర్యాల పట్టణంలో గల కల్వరి యువశక్తి అనాథాశ్రమ నిర్వాహకులతో మాట్లాడి శనివారం మంచిర్యాలలోని అనాథాశ్రమానికి తరలించారు. ఆశ్రమానికి తరలించడంపై సీఐ రవీందర్‌ను పట్టణ ప్రజలు అభినందించారు.

ఐటీ ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న ఐటీ ఉద్యోగులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉద్యోగులు శనివారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మంచిర్యాల బ్లడ్‌బ్యాంక్ సహకారంతో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వాహకులు శిబిరం ఏర్పాటు చేశారు. 40యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో కంపెనీ సీఎస్‌ఆర్ హెడ్ కీర్తన, డైరెక్టర్ సాయినాథ్ రాజు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు సంతోష్, బ్లడ్‌బ్యాంకు సిబ్బంది ప్రణయ్, రజిత, హరీష్, ప్ర భుత్వా సుపత్రి వైద్యురాలు శిరీష, ఫార్మాసిస్ట్ రుక్మిణి, ఏఎన్‌ఎం స్వప్న, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

కాకోను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే


కాకోను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల శ్రీపద్మల్‌పురి కాకోను మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట మాజీ వైస్ఎంపీపీ అనిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు భూమన్న తదితరులు ఉన్నారు.

డ్వాక్రా మహిళలకు బతుకమ్మ చీరలు



డ్వాక్రా మహిళలకు చీరలు అందిస్తూ..

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం టీకానపల్లి గ్రామంలో శనివారం డ్వాక్రా మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తాడు సతీశ్, మాజీ వార్డు సభ్యురాలు సామల లింగవ్వ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్ ఎదుట బందోబస్తు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ ఎదుట శనివారం హాజీపూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బెటాలియన్ కానిస్టేబుళ్ల భార్యలు ఏక్ పోలీస్ నినాదంతో మంచిర్యాలలో ఆందోళన కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, పోలీస్ సిబ్బంది బెటాలియన్‌కు చేరుకుని బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అప్పటికే కానిస్టేబుళ్ల భార్యలు పలువురు మంచిర్యాలలోని నిరసనకు తరలివెళ్లగా మరికొందరు వెళ్లకుండా అడ్డగించారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చెన్నూర్: లక్సెట్టిపేట మహాత్మా జ్యోతిబాఫూలే పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ స్థాయి అండర్ 17 అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ మహాత్మా జ్యోతిబాఫూలే విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి ఓవరల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ కేవీఎం ప్రకాశ్‌రావు తెలిపారు. ఓవరల్ ఛాంపియన్ షిప్‌ను సొంతం చేసుకున్న విద్యార్థులతో పాటు పీఈటీ విజయ్‌కుమార్‌లను ఆర్సీవో గోపిచంద్, డీసీవో శ్రీధర్ అభినందించారు.

రసాభాసగా క్యాతనపల్లి మున్సిపల్ సమావేశం

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఈ సమావేశం ప్రారంభం కాగానే ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు పలు అంశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలకు సంబంధించి వార్డు కౌన్సిలర్లకు ఎలాంటి సమాచారం లేకుండా కమిటీలను ఎలా ఎంపికచేస్తారని, ఈ విషయంలో మున్సిపల్ కమిషనర్ ఏకరూపకంగా వ్యవహరించారని మండిపడ్డారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు, ముగ్గురు నాయకుల మాటలనే వింటూ కమిషనర్ కౌన్సిలర్లను ఏమాత్రం పట్టించుకోవటం లేదని దుయ్యబట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయంలోనూ కమిషనర్ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదన్నారు. ఇదివరకే మంజూరైన డీఎంఎఫ్‌టీ నిధులకు సంబంధించి కేవలం అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల వార్డుల్లోనే అభివృద్ధి పనులు చేపడుతున్నారు తప్పా, అన్ని వార్డులకు సమ ప్రాధాన్యత నివ్వటంలేదని అసహనం వ్యకంచేశారు. కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. కాగా కౌన్సిల్ సమావేశంలో మొత్తం 9అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో వాగ్వాదానికి దిగిన కౌన్సిలర్లు

మంచినీటి సరఫరా నిలిపివేత

పాతమంచిర్యాల: పట్టణంలోని 36వార్డులకు ఈ నె ల 28న సోమవారం ఒక్కరోజు మంచినీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మా రుతీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మంచినీటి సరఫరా పైప్‌లైన్‌ల సాధారణ మరమ్మతుల కారణంగా మంచినీటిని సరఫరా చేయలేకపోతున్నామని, పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జన్నారం: మండలంలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ లచ్చన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పొనకల్ పట్టణ కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయడం జరుగుతుందని, మండల ప్రజలు సహకరించాలని కోరారు.

ముఖద్వారం ప్రారంభం

జైపూర్: మండలం శివ్వారం గ్రామ ప్రారంభంలో స్థానిక మాజీ సర్పంచ్ ఆవిడపు గణేశ్ ఆధ్వర్యంలో గెల్లు రాజయ్య సహకారంతో ముఖద్వారం ఏర్పాటు చేశారు. శివ్వారం రామాలయం గుడి వద్ద గ్రామ ముఖద్వారం నిర్మించి దాన్ని స్థానిక నాయకులు, దాడ రాజయ్యతో కలిసి శనివారం ప్రారంభించారు.

నస్పూర్‌లో మోడల్ లైబ్రరీ ఏర్పాటు

నస్పూర్: విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించి స్వతంత్ర్య పాఠకులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణ పరిధిలోని తీగల్‌పహాడ్ ఎంపీపీఎస్ పాఠశాలలో మోడల్ లైబ్రరీని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ.. విద్యాశాఖ అధికారుల సమన్వయంతో జిల్లాలోని ప్రతి మండలానికి ఒక మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లైబ్రరీలో వివిధ కథలతో కూడిన పుస్తకాలు, విద్యార్థుల ఆలోచన పరిధిని పెంచే వివిధ రకాల పరిజ్ఞానం కలిగిన పుస్తకాలను పొందుపర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దామోదర్, రామన్న, ఉపాధ్యాయులు ప్రభాకర్, ఏ లీలావతి, కే అలివేలుమంగ, ఎస్ అఖిల, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు, నిర్వాహకులు

నవంబర్ 8, 9తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

బెల్లంపల్లి: నవంబర్ 8, 9తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలను మందమర్రిలో నిర్వహించబోతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య, జిల్లా కార్యదర్శి సంకె రవి తెలిపారు. బెల్లంపల్లి సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహాసభలో గడిచిన మూడేళ్ల కాలంలో జిల్లాలో సీపీఎం పార్టీ చేపట్టిన ప్రజాపోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ పోరాట కార్యక్రమాలను రూపొందించుకుంటామని తెలిపారు. కార్మిక, కర్షకులు, పేదలు, గిరిజనులు, దినసరి కూలీలు, మహిళలు, విద్యార్థి, యువజనులు, అసంఘటిత కార్మికులు అన్ని వర్గాల ప్రజల కోసం, హక్కుల సాధన కోసం అనేక పోరాటాలు సాగించామని తెలిపారు. మహాసభల నిర్వాహణకు జిల్లా ప్రజలు తగిన సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోమాస ప్రకాష్, బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి జి.అశోక్, ఏరియా కమిటీ సభ్యులు దాగం రాజారాం, చల్లూరి దేవదాస్, దుర్గం సజీవన్, దాగం శ్రీకాంత్, రాములు, సభ్యులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

వంతెన నిర్మాణ పనులు ఆపాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా నాయకుల ధర్నా
- ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేత

బెల్లంపల్లి: కాసిపేట మండల పరిధి పెద్దనపల్లి గ్రామ శివారు నేషనల్ హైవే 363ను ఆనుకొని అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా వాగుపై నిర్మిస్తున్న వంతెనను వెంటనే ఆపాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేష్ ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. అరగంటకు పైగా ధర్నా చేసి ఆర్డీవో హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రకృతి సిద్ధంగా ప్రవహిస్తున్న వాగుపై దర్జాగా వంతెన కడుతున్నా, ప్రభుత్వ అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు తమకేమీ సంబంధం లేదు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, ఈ వ్యవహారంలో పలువురు అధికారులు అనుసరిస్తున్న తీరు సరిగ్గా లేదని పేర్కొన్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి ఓ ధార్మిక సంస్థ నిర్వాహకులు సిమెంట్ కాంక్రీట్‌తో పర్మినెంట్ వంతెన కడుతున్నా పట్టించుకోక పోవడం శోచనీయమని తెలిపారు. గతంలో నిర్మించిన వంతెనను కూల్చివేయాలని మంచిర్యాల నీటి పారుదల శాఖ డీఈ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఏఈ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వాల్టా చట్టాన్ని పాటించకుండా, నీటి పారుదలకు అవరోధం కలిగించేలా నిర్మిస్తున్న వంతెనను బేషరతుగా కూల్చివేయాలని డిమాండ్ చేశారు. వంతెన నిర్మిస్తున్న వారిని అరెస్టు చేసి జైలుకు పంపాలని, లేకపోతే కలెక్టర్ కార్యాలయం ఎదుట, సంబంధిత శాఖ మంత్రుల ఇళ్ల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాసిపేట మండల బీజేపీ అధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్, బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షుడు రాంచందర్, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడు కనకం శ్రీనివాస్, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి కోడి సురేష్, నాయకులు జీదుల రాములు, బాలరాజు, విష్ణువర్ధన్, సాయి తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న ఎస్సీ మోర్చా నాయకులు

గోదావరి చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సులు ఆపాలి

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి చౌరస్తా వద్ద కాళేశ్వరం, మహారాష్ట్రలోని సిరోంచ, అర్జునగుట్ట వెళ్లే ఆర్టీసీ బస్సులు ఆపాలని కోరుతూ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్, పట్టణ యువకులు, మహిళలు రిక్వెస్ట్ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహంకాళివాడ, బ్రాహ్మణవాడ, జెండవాడ, బేతాళవాడ, దుబ్బాగూడెం, బొక్కలగూడెం కాలనీ వాసులు ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లాలంటే సుమారు రెండు కిలో మీటర్ల దూరం ఉంటుందన్నారు. గోదావరి చౌరస్తాలో ఆర్టీసీ బస్సులు ఆపినట్టైతే ప్రయాణికులకు దూరం భారం తగ్గుతుందన్నారు. ఆర్టీసీ అధికారులు ఈ విషయాన్ని గుర్తించి రిక్వెస్ట్ స్టాఫ్ వద్ద బస్సులు ఆపాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాయిని సతీశ్, బజ్జూరి కమల, తిరుపతి సురేశ్, ఎనగందుల ప్రశాంత్, మేకల వెంకటేశ్ పాల్గొన్నారు.



రిక్వెస్ట్ స్టాప్ బోర్డు ఏర్పాటు చేస్తున్న కౌన్సిలర్

ఘనంగా ఫ్రెషర్స్ డే


నృత్యం చేస్తున్న అధ్యాపక బృందం, విద్యార్థులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శనివారం శ్రీహర్ష డిగ్రీ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాలలో ప్రతిభ చాటిన వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పల్లె భూమేశ్, ప్రిన్సిపాల్ మనోహర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అనితాఠాకూర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కాసిపేట: మండలంలో తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు పాఠశాల క్రీడాసమాఖ్య రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ శనివారం తెలిపారు. శ్రీరాంపూర్ ఠాగూర్ స్టేడియంలో శుక్రవారం అండర్ 19ఫుట్‌బాల్ పోటీల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థి ప్రశాంత్, 8వ తరగతి విద్యార్థి రూపక్ మంచిర్యాలలోని జిల్లా పరిషత్ పాఠశాల (బాలుర)లో నిర్వహించిన అండర్ 17 క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను, పీఈటీ శ్రీనివాస్‌గౌడ్‌ను ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

బెల్లంపల్లిరూరల్: ఆయిల్ పామ్ పంట సాగు చేయడంతో అధిక దిగుబడులు పొంది రైతులు అధిక లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి అనిత అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాల రైతువేదికలో శనివారం ఏర్పాటు చేసిన ఆయిల్ పామ్‌సాగు, యాజమాన్య పద్ధతుల అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి వసతి కలిగిన భూముల్లో ఆయిల్ పామ్ సాగు చేయడం ద్వారా ఏడాదికి రూ.1.50లక్షల ఆదాయం పొందవచ్చన్నారు. జిల్లాలోని నేలలు ఆయిల్ పామ్ సాగుకు అనువుగా ఉన్నాయని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేయడానికి రైతులను పోత్సహించడానికి ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బెల్లంపల్లి ఏడీఏ రాజనరేందర్ మాట్లాడుతూ.. రైతులు మూస పద్ధతిలో కాకుండా ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్ వంటి అధిక ఆదాయాన్ని ఇచ్చే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ బెల్లంపల్లి క్లస్టర్ అధికారి అర్చన, బెల్లంపల్లి, కాసిపేట మండలాల వ్యవసాయ శాఖ అధికారులు ప్రేమ్ కుమార్, ప్రభాకర్, భీమిని హెచ్‌వో అరుణ్, మ్యాట్రిక్స్ సీఈవో ఉదయ్, ఫీల్డ్ ఆఫీసర్ రాము, ఏఈవో, రైతులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అనిత

కనకరాజు మృతికి సంతాపం

బెల్లంపల్లి: పద్మశ్రీ అవార్డు గ్రహీత, గోండు గుస్సాడి నృత్య కళాకారుడు కనకరాజు మృతికి బెల్లంపల్లికి చెందిన కళాకారులు, కాంగ్రెస్ శ్రేణులు సంతాపం తెలిపారు. కనకరాజు మృతదేహాన్ని సందర్శించి శనివారం పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం (టీఆర్‌జేకేఎస్) రాష్ట్ర కార్యదర్శి హన్మాండ్ల మధు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ బెల్లంపల్లి ఉపాధ్యక్షుడు గజ్జెల రాంనాథ్, నృత్యకళాకారుడు డొంగ్రి సంతోష్ మాట్లాడారు. గుస్సాడి నృత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్పకళాకారుడని కొనియాడారు. కనకరాజు మృతి ఆదివాసీలకు తీరని లోటని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


మృతదేహానికి పుష్పాంజలి ఘటిస్తున్న శ్రేణులు

మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే తెలియజేయాలి

- జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు డా.ఎం కోటేశ్వర్

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ వైద్య విధాన పరిషత్–జిల్లా ఆసుపత్రుల ప్రధాన అధికారి కార్యాలయం పరిధిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను ఒప్పంద పద్ధతిలో భర్తీ చేసే ప్రక్రియలో ప్రాథమిక మెరిట్ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 28నుంచి 30వ తేదీ లోగా తెలియజేయాలని జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులు డా.ఎం కోటేశ్వర్ అన్నారు. మెరిట్ జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో, కార్యాలయ నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. కార్యాలయ పనివేళల్లో సమీకృత జిల్లా కార్యాలయ భవనంలోని ఎఫ్–24లో గల జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పర్యవేక్షకులకు రాతపూర్వకంగా సమర్పించాలని తెలిపారు.

'ఆదరించి గెలిపిస్తే అందుబాటులో ఉంటా'

జన్నారం: తాను స్థానికుడినని, ఆదరించి గెలిపిస్తే అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానని ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారుడు, ఎమ్మెల్సీ పోటీదారు యాదగిరి శేఖర్‌రావు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదులో భాగంగా శనివారం జన్నారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు అనేక సమస్యలతో ఉన్నారని, ఎమ్మెల్సీగా శాసన మండలికి పంపితే సమస్యలపై గళం విప్పుతానని పేర్కొన్నారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు ఆదరించి అత్యధిక సంఖ్యలో ఓటు నమోదు చేయించుకొని, ఇతరులతో చేయించి, వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలువాలని కోరారు. సమావేశంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనుగు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, మధుసూధన్, మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, దండేపల్లి మండల ప్రధాన కార్యదర్శి రాజలింగం, కోశాధికారి శేఖర్, లయన్స్‌క్లబ్ జెడ్‌సీ అంజుతరావు తదితరులు పాల్గొన్నారు.